ఉదయగిరి టీడీపీలో తమ్ముళ్ల తన్నులాట

ఉదయగిరి టీడీపీలో వర్గ రాజకీయాలు ఆ పార్టీ ప్రతిష్టను మరింత దిగజార్చాయి. నియోజకవర్గంలో అధిపత్యం కోసం తమ్ముళ్లు తన్నులాడుకున్నాంటున్నారు. ఉదయగిరి ఎన్నికల బరి నుంచి రాజకీయ సన్యాసం ప్రకటించిన బొల్లినేని.. నియోజకవర్గంలో పెత్తనం కోసం మాత్రం పాకులాడుతున్నట్లు కనిపిస్తోంది. ఈ దఫా టీడీపీ అభ్యర్థిగా రంగంలోకి దిగాలని పాకులాడుతున్న కాకర్ల సురేష్ లోకేశ్ యాత్రకు చేపడుతున్న కార్యక్రమాలను బొల్లినేని వర్గం అడ్డుకుంటుంది. గత రెండు రోజులుగా కాకర్ల, బొల్లినేని వర్గాలు బాహాబాహీగా తలపడి తన్నుకుంటున్నాయి.

- ఉదయగిరిలో కాకర్ల, బొల్లినేని మధ్య అధిపత్య విభేదాలు
- ఫ్లెక్సీల వివాదంతో మరింత ఆజ్యం
- సురేష్ క్యాంపు ఏర్పాటును అడ్డగించిన బొల్లినేని వర్గాలు
- లోకేశ్ యువగళం ఎంట్రీకి ముందే పార్టీలో ఉకలుకలు

ఉదయగిరి: ఎన్నికల బరి నుంచి రాజకీయ రిటైర్‌మెంట్ ప్రకటించిన ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే బొల్లినేని రామారావు తాజాగా యూటర్న్ తీసుకున్నాడు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రభను తట్టుకుని రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే ధైర్యం చాలక ఏడాదికి ముందే ఎన్నికల్లో ఇక పోటీ చేయనని బహిరంగంగానే ప్రకటించారు. దీంతో ఉదయగిరి నుంచి పోటీ చేయాలని కొందరు ఆశావహులు ముందు నుంచే తమ ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఇదే సమయంలో ఉదయగిరి రాజకీయాల్లో పెను మార్పులు చోటు చేసుకున్నాయి. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖరరెడ్డి పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడడంతో సస్పెండ్ చేసింది. దీంతో ఆయన టీడీపీకి జై కొట్టారు. ఈ తరుణంలో వైఎస్సార్‌సీపీ నుంచి బలమైన నేత పోటీలో ఉండే అవకాశం లేదని, వచ్చేవారు కొత్త వారు అవుతారని, ఈ సారి పోటీ చేస్తే తాను గెలిచే అవకాశాలు ఉన్నాయని కలలు కంటున్న బొల్లినేని రామారావు తూచ్ అంటూ యూటర్న్ తీసుకున్నాడు. దీంతో ఆ పార్టీలో ఆశావహులను తొక్కేసే ప్రయత్నం చేస్తున్నాడు. లోకేశ్ యువగళం యాత్ర మొత్తం తానే లీడ్ చేయాలనే ఉద్దేశంతో వ్యవహరిస్తున్నారు.


కొండాపురంలో శనివారం రెండు వర్గాల మధ్య ఘర్షణ (ఫైల్)

ఫ్లెక్సీలు గోల..

కాకర్ల సురేష్ ట్రస్ట్ పేరుతో వివిధ సేవా కార్యక్రమాలు ప్రారంభించడం టీడీపీలో బొల్లినేని, కాకర్ల వర్గాల మధ్య లొల్లి ప్రారంభమైంది. కాకర్ల సురేష్ లోకేశ్ ఆశీస్సులతో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఉదయగిరి నుంచి పోటీ చేసేందుకు ప్రణాళికలు రచించుకుంటుండగా, టీడీపీ అధినేత చంద్రబాబు అండతో తిరిగి పోటీ చేయాలని బొల్లినేని యోచిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో ఉదయగిరి టికెట్టు తనదే అనే ధీమాతో ఉన్న బొల్లినేనికి కాకర్ల సురేష్ పోటీగా రావడంతో వివాదం మొదలైంది. 2012 నుంచి నియోజకవర్గం కనిపెట్టుకుని ఉన్న బొల్లినేనికి ఊహించని రీతిలో కాకర్ల సురేష్ రంగంలోకి రావడం, ఆయనకు లోకేశ్ అండ ఉందనే ప్రచారం బొల్లినేని వర్గీయులను తీవ్ర కలవరానికి గురి చేస్తోంది. పార్టీ ఇన్‌చార్జిగా ఉన్న బొల్లనేనికి సంబంధం లేకుండా కాకార్ల ముందుకు వెళ్తున్నారు. ఎన్నికల సమీపించే నాటికి టీడీపీలో తన పట్టు సాధించి టికెట్ రేస్‌లో నిలివాలని పక్కా ప్లాన్‌తో ఉండడంతో ఇది పసిగట్టిన బొల్లినేని రామారావు కాకర్లకు చెక్ పెట్టేందుకు పావులు కదుపుతున్నారు. తనకు ఆధిపత్యం ఉన్న గ్రామాలు, మండల కేంద్రాల్లో కాకర్ల సురేష్ ఫ్లెక్సీల ఏర్పాటును అడ్డుకుంటున్నారు. కొన్ని చోట్ల సురేష్ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను బొల్లినేని వర్గీయులు చించివేశారు. దీంతో ఇరువర్గాల మధ్య విభేదాలు తీవ్ర స్థాయికి చేరాయి.

లోకేశ్‌ను తరచూ కలుస్తున్న కాకర్ల

లోకేశ్ యువగళం యాత్ర జిల్లాలో ప్రవేశం సందర్భంగా మర్రిపాడు మండలంలో కాకర్ల సురేష్ భారీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. యువనేత దృష్టిలో పడేందుకు తగిన ఏర్పాట్లు చేసుకున్నారు. ప్రవేశం రోజు బొల్లినేనిని డామినేట్ చేస్తూ నియోజకవర్గం నుంచి ఎక్కువ సంఖ్యలో వాహనాలు ఏర్పాటు చేసి తమ అనుచరులను తరలించారు. ఈ పరిణామం బొల్లినేనికి రుచించలేదు. పైగా జిల్లాలో యాత్ర సందర్భంగా ఎక్కువ సార్లు యువనేతను కాకర్ల కలిసి నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి తాను చేస్తున్న కార్యక్రమాలు వివరిస్తున్నారు. దీనికి లోకేష్ కొనసాగించు నేను చూసుకుంటా అని చెప్పడంతో బొల్లినేని వర్గీయుల్లో మరింత ఆందోళన మొదలైంది. టికెట్‌కు చెక్ పెట్టెందుకు కాకర్ల పావులు కదుపుతున్నట్లు బొల్లినేని అనుమానిస్తున్నారు.

యువగళం యాత్ర తెచ్చిన తంటా


లోకేష్ యువగళం యాత్ర మంగళవారం ఉదయగిరి నియోజకవర్గంలో ప్రవేశిస్తున్నందున యువనేతకు భారీగా స్వాగతం పలికేందుకు కాకర్ల సురేష్ ఏర్పాటు చేస్తున్నారు. యువనేత దృష్టి తమ వైపు తిప్పుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. రెండు రోజల క్రితం యాత్ర జరగనున్న దారిలో కాకర్ల ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీలను కట్టనీయకుండా బొల్లినేని వర్గీయులు అడ్డుకున్నారు. దీంతో అమీతుమీకి సిద్ధమైన కాకర్ల వర్గీయులు శనివారం చోడవరం సమీపంలో క్యాంపు ఏర్పాటు చేసుకుని ఫ్లెక్సీలు కట్టే ప్రక్రియ ప్రారంభించారు. ఇది తెలుసుకున్న బొల్లినేని వర్గీయులు అడ్డుకునే ప్రయత్నంలో రెండు వర్గాలు కొట్లాటకు దిగాయి. ఇరువురు జలదంకి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. దీంతో ఉదయగిరి నియోజకవర్గంలో టీడీపీలో వర్గ విభేదాలు తారా స్థాయికి చేరుకున్నాయి. యువగళం యాత్రలో రెండు వర్గాలు తమ ఆదిపత్యం కోసం తీవ్రరగా పోటీ పడే అవకాశం ఉంది. గొడవ జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఇంతవరకు నియోజకవర్గంలోని టీడీపీలో తిరుగులేని ఆధిపత్యం సాగించిన బొల్లినేని వర్గీయులకు కాకర్ల సురేష్ పెద్ద సమస్యగా మారారు. ఈ పరిణామాలు అంతటికి కారణం లోకేష్, చంద్రబాబులే అని పార్టీ క్యాడర్ చర్చించుకుంటున్నారు. కాకర్ల సరేష్‌ను లోకేశ్ ప్రోత్సహిస్తుండగా, బొల్లినేని రామారావును చంద్రబాబు ఆదరిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. ఇది తండ్రీ కొడుకులు ఆడే పొలిటికల్ గేమ్‌గా రాజకీయ విశ్లేకులు చెబుతున్నారు. మొత్తం మీద యువగళం యాత్ర పుణ్యమా అని ఉదయగిరి టీడీపీని రెండు వర్గాలుగా చీల్చిందని భవిష్యత్తులో పార్టీకి ఎంత కీడు చేస్తోందనే ఆందోళన టీడీపీ అభిమానులను ఆందోళనకు గురి చేస్తోంది.

రావి ఆకుపై వైఎస్సార్ చిత్రాలు

- దారంతో వైఎస్సార్ ప్రతిమ


దారంతో పలుచటి వస్త్రంపై దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడి ప్రతిమను తీర్చిదిద్దిన శివశంకరయ్య

ఆత్మకూరు రూరల్ (మర్రిపాడు): మర్రిపాడు మండలం చుంచులూరు జెడ్పీ ఉన్నత పాఠశాల తెలుగు టీచర్ మున్నెళ్లి శివశంకర్ తన సూక్ష్మ కళతో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డికి నివాళి అర్పించారు. వైఎస్సార్ 74వ జయంతిని పురస్కరించుకుని అరుదైన ఆవిష్కరణలు చేశారు. గతంలో బహుముఖ ప్రజ్ఞతో వివిధ కళాకృతులు తయారు చేసిన శివశంకరయ్య డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డిపై తనకున్న అభిమానంతో రావి ఆకుల మీద ధ్యానముద్రలో ఉన్న వైఎస్సార్‌తో పాటు ప్రజలకు అభివాదం చేస్తున్న మరో వైఎస్సార్ చిత్ర భంగిమలను తీర్చిదిద్దాడు. డాక్టర్ వైఎస్సార్ నిలువెత్తు ప్రతిమను దారంతో పలుచటి వస్త్రంపై తీర్చిదిద్దాడు. శివశంకరయ్య కళాప్రతిభను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందించారు.


రావి ఆకులపై శివశంకరయ్య తీర్చిదిద్దిన డాక్టర్ వైఎస్సార్ కళాకృతులు

క్లుప్తంగా

అచ్చమాంబ సన్నిధిలో 16 రోజుల పండగ


విశేష పూజలు అందుకుంటున్న అచ్చమాంబ పేరంటాలు

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మండలంలోని పొంగూరు మాలిచేలో కొలువై ఉన్న అచ్చమాంబ పేరంటాలు దేవస్థానంలో 16 రోజుల పండగను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించారు. పొంగూరుకు చెందిన చల్లా వెంకటేశ్వరరెడ్డి దంపతులు భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ పూజారి పాశర్లపూడి వెంకటేశ్వరశర్మ భక్తులకు విశేష పూజల అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.

బాధితుడికి ఆర్థిక సహాయం


బాధితుడి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందిస్తున్న దృశ్యం

ఉదయగిరి: మండలంలోని గండిపాళెంకు చెందిన గోరంట్ల కృష్ణయ్య ఇటీవల జరిగిన బైక్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషయం తెలుసుకున్న మండల ఉపాధ్యక్షుడు, జీఎంకే ట్రస్ట్ అధ్యక్షుడు గుంటుపల్లి మాలకొండయ్య ఆదివారం తమ సంస్థ ప్రతినిధుల ద్వారా బాధితుడికి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు బి.వెంకటేశ్వర్లు, పాముల రాజా, గోసు మహేష్ తదితరులు ఉన్నారు.

నేడు డీసీపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మర్రిపాడు మండలం డీసీపల్లిలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని మేకపాటి విక్రమ్‌రెడ్డి నిర్వహిస్తారని డీసీపల్లి సర్పంచ్ రేవూరు సుప్రజ, ఎంపీటీసీ పేర్నాటి దొరసానమ్మ ఆదివారం తెలిపారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, గృహ సారథులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

మహాజన సోషలిస్టు పార్టీ జెండా ఆవిష్కరణ


పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న నేతలు

వింజమూరు (ఉదయగిరి): మండలంలోని నేరేడుపల్లిలో ఆదివారం మహాజన సోషలిస్టు పార్టీ జెండాను ఆ పార్టీ నేతలు మంద సుజాత, అంబేడ్కర్, జీ శ్రీనివాసులు ఆవిష్కరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ పేద వర్గాల ప్రజలను రాజ్యాధికారం వైపు తీసుకెళ్లేందుకు పార్టీని స్థాపించి గ్రామ స్థాయికి తీసుకెళ్తున్నట్లు చెప్పారు. భవిష్యత్‌లో రాజ్యాధికారం చేపట్టడమే లక్ష్యంగా పనిచేయాలని కార్యకర్తలకు ఆమె సూచించారు. అనంతరం పార్టీ మండల నూతన కన్వీనర్‌గా నీలం శ్రీనివాసులు, కో-కన్వీనర్‌గా ఇండ్ల పోలయ్యను ఎన్నుకున్నారు.

వివాదాస్పద ఏబీఎం స్థలం పరిశీలన

ఉదయగిరి: ఉదయగిరిలోని ఏబీఎం స్థలాలను కొంత మంది ప్లాట్‌గా విభజించి అమ్మకాలు చేస్తున్న నేపథ్యంలో ఆదివారం హైకోర్టు సీనియర్ నాయవాది, ఏపీ పౌరహక్కుల సంఘం జనరల్ సెక్రటరీ చిలకల చంద్రశేఖర్ పరిశీలించారు. ఏబీఎం స్థలాలను ఎవరూ అమ్మకూడదని, కొనకూడదన్నారు. క్రయ విక్రయాలు చేసే వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. క్రైస్తవులు ఐక్యంగా ఉండి ఆస్తులను కాపాడుకోవాలన్నారు. అనంతరం సంఘ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు.

భక్తి శ్రద్ధలతో పోలేరమ్మతల్లికి పొంగళ్లు

కలిగిరి: మండలంలోని కృష్ణారెడ్డిపాళెం గ్రామదేవత పోలేరమ్మతల్లికి గ్రామస్తులు ఆదివారం భక్తిశ్రద్ధలతో పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం మహిళలు ఆలయం వద్దకు వెళ్లి సద్దిని అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. పెద్ద తల్లి వేపచెట్టుకు ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం మహిళలు డప్పు వాయిద్యాలతో ఊరేగింపు ఆలయం వద్దకు చేరుకున్నారు. ఆలయం ప్రాంగణంలో పొంగళ్లు పెట్టారు. పొంగళ్లను అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. గ్రామానికి ఎలాంటి చీడపీడలు ఆశించకుండా చూడాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండేలా చూడాలని మొక్కుకున్నారు.

కలిగిరమ్మతల్లి తిరునాళ్ల ప్రారంభం


ప్రత్యేక అలంకరణలో కలిగిరమ్మతల్లి


కలిగిరమ్మతల్లి ఆలయం

కలిగిరి: కలిగిరి గ్రామదేవత శ్రీకలిగిరమ్మ తల్లి తిరునాళ్లు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఐదు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారి ఆలయం ఎదుట సుడిమానును నిలిపి తిరునాళ్లను ప్రారంభించారు. రెండో రోజు సోమవారం అమ్మవారి పుట్టినిల్లు పాపనముసిలిపాళెంలో వేడుకలు జరుపుతారు. గ్రామోత్సవం అనంతరం మంగళవారం అమ్మవారి మెట్టినిలైన జిర్రావారిపాళెంకు చేరుస్తారు. జిర్రావారిపాళెంలో పూజలు, గ్రామోత్సవాల అనంతరం బుధవారం అమ్మవారిని కలిగిరికి చేరుస్తారు. తిరునాళ్ల ముగింపు సందర్భంగా గురువారం కలిగిరమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు జరుపుతారు. అమ్మవారికి పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పిస్తారు. మధ్యాహ్నం నుంచి ఆలయం చుట్టూ బండ్లు, ప్రభలు తిప్పుతారు. చివరిగా సుడిమానును తిప్పి అమ్మవారిని తిరునాళ్లను ముగిస్తారు. వేలాది మంది భక్తులు తరలి వస్తుండడంతో ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా ఏర్పాటు చేస్తున్నారు. కలిగిరి సీఐ ఫిరోజ్, ఎస్సై సూర్యప్రకాష్‌రెడ్డి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

అపస్ అభ్యాసవర్గ శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న ఉపాధ్యాయ సంఘ నాయకులు

సంగం: సంగం జెడ్పీ హైస్కూల్‌లో ఆదివారం ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అభ్యాసవర్గ ఒక్క రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ముఖ్య అతిథిగా అపస్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, ఎస్వీ యూనివర్సిటీ ప్రొఫెసర్ వైవీ రామిరెడ్డి పాల్గొన్నారు. రాబోయే రోజుల్లో ఉపాధ్యాయ సమస్యలపై చేపట్టాల్సిన కార్యాచరణపై వారికి పలు సూచనలు చేశారు. అపస్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఒకే సర్వీస్ రూల్స్ అమలు చేయాలని సూచించారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో అపస్ ఆధ్వర్యంలో లోకసభ, రాజ్యసభ ఎంపీలకు ఉపాధ్యాయ సమస్యలపై వినతిపత్రాలు సమర్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అపస్ రాష్ట్ర కార్యదర్శి వెంకయ్య, జిల్లా అధ్యక్షుడు రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్సార్ జయంతి వేడుకలు


కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న నాయకులు

అనుమసముద్రంపేట: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను మండలంలోని హసనాపురంలో ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. రాజవోలు సొసైటీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్ కృష్ణ హసనాపురం కూడలిలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. వారు మాట్లాడుతూ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రైతులకు, పేదలకు ఎంతో మేలు చేశారని కొనియాడారు. ఆయన తరహాలోనే ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజల గుండెల్లో నిలిచిపోతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కో ఆప్షన్ సభ్యుడు సంధాని, వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

కిషోర్‌కుమార్‌కు జాతీయ స్థాయి అవార్డు


ఎన్టీఆర్ బెస్ట్ క్రియేటివ్ ఆర్టిస్ట్ అవార్డు అందుకున్న కిషోర్‌కుమార్

చేజర్ల: చేజర్ల జిల్లా ప్రజా పరిషత్ హైస్కూల్‌లో డ్రాయింగ్ మాస్టర్‌గా పనిచేస్తున్న తోట కిషోర్‌కుమార్‌కు ఎన్టీఆర్ బెస్ట్ క్రియేటివ్ ఆర్టిస్ట్ అవార్డు లభించింది. విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో 9వ తేదీ ఆదివారం జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో అంజి క్రియేటివ్ హార్ట్ అకాడమీ ద్వారా ఈ అవార్డును అందుకున్నారు. ఈయనది కలువాయి మండలం కుల్లూరు. కిషోర్‌కుమార్‌కు జాతీయస్థాయి అవార్డు రావడంపై పాఠశాల హెచ్ఎం పి.హైమావతి, తోటి ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

నేడు మండల స్థాయి అధికారుల సమావేశం

దుత్తలూరు: దుత్తలూరులోని బిట్-2 సచివాలయంలో మధ్యాహ్నం 2.30 గంటలకు మండల స్థాయి అధికారులతో నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజారెడ్డి సమీక్ష సమావేశం నిర్వహిస్తారని వైఎస్సార్‌సీపీ మండల నేత డీ వాసుదేవరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని వివరించారు.

సహాయ గ్రూప్ ఆర్థిక సాయం


అనారోగ్య బాధితుడికి ఆర్థిక సాయం అందజేస్తున్న సహాయ గ్రూప్ సభ్యులు

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మండలంలోని పడమటినాయుడుపల్లికి చెందిన మహబూబ్‌బాషా కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో వైద్యం చేయించుకుంటున్నాడు. కూలి చేసుకుంటే కానీ పూట గడవని ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఆ గ్రామానికి చెందిన సహాయ గ్రూప్ సభ్యులు స్థానిక ఉపాధ్యాయులు విజయభాస్కర్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, ఇస్మాయిల్ ఆదివారం ఆ కుటుంబ సభ్యులకు కొంత ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ గతంలో కూడా సహాయ గ్రూపు సభ్యులు తమకు కొంత సహాయం చేశారని తమ ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మరొకసారి సాయం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

మార్యాదపూర్వకంగా..



నెల్లూరు(బారకాసు): వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డిని ఆ పార్టీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు, 21వ డివిజన్ కార్పొరేటర్ మొయిళ్ల గౌరి ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. నగరంలోని నివాసంలో ఆయన్ని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఉదయగిరి నియోజకవర్గ మహిళా కమిటీపై చర్చించారు.

ఈ- కేవైసీ త్వరితగతిన పూర్తి చేయండి

కావలి: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు ఈ నెల 15వ తేదీ లోగా ఈ-కేవైసీ చేయించుకోవాలని జిల్లా ట్రెజరీ, అకౌంటెంట్ ఆఫీసర్లు తెలియజేశారు. కావలి ట్రెజరీ పరిధిలోని సర్వీస్, ఫ్యామిలీ పెన్షనర్లు స్వయంగా కానీ, ట్రెజరీలో కానీ, పెన్షనర్స్ భవన్‌లో కానీ తప్పనిసరిగా ఈ-కేవైసీ నమోదు చేసుకోవాలన్నారు. ఏవైనా సందేహాలు ఉంటే పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆకుల రమణయ్య, ఫోన్ 99852 37349 నంబరులో సంప్రదించాలన్నారు.

మసీదుల్లో వసతుల కల్పనకు ప్రతిపాదనలు

- వైఎస్సార్‌సీపీ మైనార్టీ జోనల్ ఇన్‌చార్జి సయ్యద్ హంజాహుస్సేని


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న హంజాహుస్సేని

ఉదయగిరి: నియోజకవర్గంలోని ఉదయగిరి, దుత్తలూరు, వింజమూరు, వరికుంటపాడు మండలాల్లోని పలు మసీదుల అభివృద్ధి, మరమ్మతుల కోసం నిధుల మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని నెల్లూరు, తిరుపతి, కడప జిల్లాల వైఎస్సార్‌సీపీ మైనార్టీ జోనల్ ఇన్‌చార్జి సయ్యద్ హంజాహుస్సేని తెలిపారు. ఆయా మండలాల్లోని పలు మసీదులను ఆయన సందర్శించి స్థానికులతో మాట్లాడారు. మైనార్టీల అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. ఈ నెల చివరిలో కర్నూలులో జయహో ముస్లింల సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం జయహో ముస్లింల సదస్సుకు సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించారు. ఆయన వెంట ఉదయగిరి ఉపసర్పంచ్ ముర్తుజా హుస్సేన్, గడియాల్చి యస్దాని తదితరులు ఉన్నారు.

బాకీ డబ్బులు అడిగితే తప్పుడు ఆరోపణలా?


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సంగం: టీడీపీ మైనార్టీ నాయకుడి షేక్ బాబు ఇంటిపై శనివారం వైఎస్సార్‌సీపీ నాయకుడు కంటాబత్తిన రఘునాథ్‌రెడ్డి అనుచరులు దాడి చేశారని ఆరోపణలు అవాస్తవమని వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. ఆదివారం సంగం ఇరిగేషన్ గెస్ట్‌హౌస్‌లో వైఎస్సార్‌సీపీ మైనార్టీ, దళిత నాయకులు విలేకరుల సమావేశంలో వాస్తవాలు వెల్లడించారు. వైఎస్సార్ సీపీ మైనార్టీ నాయకుడు షేక్ కరిముల్లా మాట్లాడుతూ బాకీ డబ్బులు అడిగేందుకు ఇంటికి వెళ్లిన వారిపై కేసులు పెట్టడం సరికాదని మండిపడ్డారు. తలుపూరుపాడుకు చెందిన నీకు సంగం రాజకీయాలతో ఏం సంబంధమని ప్రశ్నించారు. ఇలాంటి తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు గంటా నరసింహులు మాట్లాడుతూ బాకీ డబ్బులు అడిగేందుకు వెళ్లిన దళిత యువకుడిపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దళితులను చిన్న చూపు చూడడం వారి సంస్కారానికి అద్దం పడుతుందన్నారు. వారిపై ఎస్సీ, ఎస్టీ కేసును వెంటనే నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మానికల చందన్ కుమార్, ఫణికుమార్‌రెడ్డి, శివ, కరుణాకర్, జహంగీర్, పెంచలయ్య తదితరులు ఉన్నారు.

వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే మేకపాటి


వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి

ఆత్మకూరు: నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ ఇన్‌చార్జి షేక్ పర్వీన్ కుమార్తె వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు. పట్టణంలోని శ్రీధర్ గార్డెన్స్‌లో ఆదివారం జరిగిన ఈ వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. వారి వెంట ఎంపీపీలు కేతా వేణుగోపాల్‌రెడ్డి, బోయిళ్ల పద్మజారెడ్డి, పార్టీ నాయకులు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, జిల్లా మహిళా నాయకురాలు మొయిళ్ల గౌరి, ఐవీ రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏబీవీపీ 75వ ఆవిర్భావ దినోత్సవం


ఏబీవీపీ జెండాను ఆవిష్కరింపజేస్తున్న దృశ్యం

ఆత్మకూరు: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) 75వ ఆవిర్భావ దినోత్సవాన్ని పట్టణంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఏబీవీపీ విద్యార్థి సంఘం జిల్లా కన్వీనర్ ఎం.అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక శివాజీ సెంటర్‌లో ఆటోడ్రైవర్‌తో ఏబీవీపీ జెండాను ఆవిష్కరించారు. అశోక్‌రెడ్డి మాట్లాడుతూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ 75వ సంవత్సరంలో అడుగు పెట్టిందని, దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో విద్యార్థుల సమస్యలు తీర్చడంలో ప్రముఖ పాత్ర పోషించిందన్నారు. ఏబీవీపీ వ్యక్తి నిర్మాణం చేయడంతో పాటు దేశభక్తిని పెంపొందింపజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ విద్యార్థి సంఘం నాయకులు ప్రవీణ్, జయంత్, కిషోర్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.